## క్లుప్తంగా

### త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం



త్రైత సిద్ధాంత భగవద్గీత గ్రంథంపై ప్రచారం చేస్తున్న ప్రబోధ సేవా సమితి సభ్యులు

**నందికొట్కూరు:** పట్టణంలోని త్రైత సిద్ధాంతం భగవద్గీత గ్రంథ ప్రచారం ఆదివారం సుబ్బారావుపేటలో నిర్వహించారు. త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి సభ్యులు రామచంద్రుడు, మునిదాసు మాట్లాడుతూ.. కోరికలు, కర్మలు పూర్తిగా లేకుండా పోతే ఉత్తరాయణం రోజు మోక్షం కలిగి విముక్తి కలుగుతుందన్నారు. కార్యక్రమంలో పుల్లారెడ్డి, వెంకటేశ్వర్లు, కుమార్, సంజీవ, శ్రీనివాసులు, మనోహర్, చక్రపాణి, సుబ్బలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

### శనగలో పంటకోత ప్రయోగం



శనగపంటలో పంటకోత ప్రయోగం నిర్వహిస్తున్న దృశ్యం

**జూపాడుబంగ్లా:** వర్షాభావ పరిస్థితుల వల్ల శనగపంట దిగుబడి తగ్గినట్లు పంటకోత ప్రయోగం ద్వారా వెల్లడైనట్లు తంగడంచ ఆర్బీకే వీహెచ్‌ఏ వెంకటేశ్ తెలిపారు. ఆదివారం తంగడంచ రెవెన్యూ గ్రామపరిధిలోని అబ్దుల్ ముత్తల్లికి చెందిన పొలంలో రబీ సీజన్‌కుగాను సాగుచేసిన శనగపంటలో పంటకోత ప్రయోగం నిర్వహించారు. నిర్ణీత కొలతల ప్రకారంగా 4కిలోల దిగుబడి రావాల్సి ఉండగా కేవలం 2 కిలోల 10గ్రాముల వచ్చినట్లు తెలిపారు. వర్షాభావ పరిస్థితుల వల్ల పంట దిగుబడి తగ్గినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ ఇన్సురెన్స్ వెల్డర్ అజ్మతుల్లా, రైతులు పాల్గొన్నారు.

### స్వీపర్ మృతికి సంతాపం

**పగిడ్యాల:** అనారోగ్యం బారినపడి కొలుకోలేక ఆదివారం మృతి చెందిన స్థానిక గ్రామ పంచాయతీ స్వీపర్ పెరుమాళ్ల రాముడు అలియాస్ ఏసన్న(75) కుటుంబానికి గ్రామ సర్పంచ్ పెరుమాళ్ల శేషన్న, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులు, మాజీ జెడ్పీటీసీ పుల్యాల నాగిరెడ్డి సంతాపం తెలిపారు. మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

### మహానందిలో ఫిబ్రవరి 1న టెండర్లు

**మహానంది:** మహానందిలో ఫిబ్రవరి ఒకటవ తేదీన వివిధ అంశాలకు టెండర్లు నిర్వహిస్తున్నట్లు ఈఓ కాపు చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ నవగ్రహాల వద్ద దీపారాధన సామగ్రి విక్రయం, కొబ్బరి చిప్పల సేకరణ, వాహన పూజలు జరిపించుకునే లైసెన్సు హక్కులతో పాటు మరికొన్ని అంశాలకు వేలాలు ఉంటాయన్నారు. సీల్డు, ఈ- ప్రొక్యూర్‌మెంట్, బహిరంగ వేలాల విధానాల్లో టెండర్లు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

**ఓంకారంలోనూ టెండర్లు**

బండిఆత్మకూరు మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన ఓంకారం ఆలయంలో ఫిబ్రవరి ఒకటవ తేదీన టెండర్లు నిర్వహిస్తున్నట్లు ఈఓ నాగప్రసాద్ తెలిపారు. ఆలయానికి వచ్చిన భక్తులు పాదరక్షలు భద్రపరచుకునేందుకు, టెంకాయల విక్రయానికి, ఐస్ క్రీమ్ బండ్లు పెట్టుకునేందుకు, కూల్ డ్రింక్స్ అమ్మకానికి టెండర్లు ఉంటాయన్నారు. టెండర్లలో పాల్గొనాల్సిన వారు రూ.10,000 డిపాజిట్టు చెల్లించాల్సి ఉంటుందని చెప్పారు.

### మహానందిలో సండే సందడి

**మహానంది:** మహానందిలో సెలవురోజు కావడంతో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి భక్తులు ఆలయానికి తరలివచ్చారు. శ్రీ కామేశ్వరి దేవి, మహానందీశ్వర స్వామివార్లను దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు చేపట్టారు. ఉదయం అష్టవిధ మహామంగళ హారతుల సమయంలో, ఆర్జిత సేవా టికెట్ల ద్వారా శివస్వాములు అధిక సంఖ్యలో స్వామి, అమ్మవారిని దర్శించుకున్నారు. బండిఆత్మకూరు మండలంలోని ఓంకార క్షేత్రంలోనూ ఆదివారం భక్తులసందడి కనిపించింది. ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ విశ్వనాథరెడ్డి, ఈఓ నాగప్రసాద్ ఆధ్వర్యంలో అర్చకులు శ్రీ గంగ, ఉమా సమేత ఓంకార సిద్ధేశ్వరస్వామి వారికి విశేష పూజలు చేపట్టారు.

### నల్లమలలో చలి



మహానందిలో చలిమంట వద్ద చిన్నారులు

**మహానంది:** నల్లమల సమీప ప్రాంతాల్లో ఉదయం, సాయంత్రం వేళల్లో చలి చంపేస్తోంది. ఉదయం 8 గంటలైనా మంచు కురుస్తూనే ఉంది. గ్రామాల్లో పిల్లలు, పెద్దలు చలిమంటలు కాపుకుంటూ చలినుంచి ఉపశమనం పొందుతున్నారు. మహానంది సమీపంలో ఉదయం మంచు, సాయంత్రం ఆలయ పరిసరాల్లో అరుణకాంతులు ఆహ్లాదకరంగా కనిపిస్తున్నాయి.

# వాగు కష్టాల నుంచి విముక్తి

- 60 ఏళ్ల తర్వాత నెరవేరనున్న పారుమంచాల వాసుల కల
- టీడీపీ పాలనలో ప్రజలు ఆందోళన చేసినా పట్టించుకోని చంద్రబాబు
- జగనన్న సీఎం అయ్యాక రూ.5కోట్లతో ఇసుకవాగుపై వంతెన మంజూరు
- చురుగ్గా సాగుతున్న నిర్మాణ పనులు

**జూపాడుబంగ్లా:** వర్షాకాలం వచ్చిందంటే చాలు పారుమంచాల గ్రామస్తులు ఇసుకవాగు దాటాలంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకోవాల్సి వచ్చేది. గంటల తరబడి వాహనాల రాకపోకలు స్తంభించిపోయేవి. ఇలాంటి దుర్భర పరిస్థితుల నుంచి విముక్తి కలిగించాలని టీడీపీ పాలనలో పారుమంచాల గ్రామస్తులు, ప్రయాణికులు ధర్నాలు, రాస్తారోకోలు చేసినా ప్రజలు, ప్రయాణికుల కష్టాలను చంద్రబాబునాయుడు పట్టించుకున్న దాఖలాల్లేవు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక నిధులు విడుదల చేయడంతో వంతెన నిర్మాణ పనులను ప్రారంభించారు. వంతెన నిర్మాణం పూర్తైతే తమకష్టాలు తీరినట్లేనని పారుమంచాల గ్రామస్తులతో పాటు తూడిచెర్ల, వాడాల, రేగడగూడూరు, తదితర గ్రామాల ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

**సత్వరమే స్పందించిన సీఎం జగనన్న**

ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో 60 ఏళ్ల నుంచి ప్రజలు, ప్రయాణికులు వాగు కష్టాల నుంచి విముక్తి పొందనున్నారు.





వర్షాకాలంలో ఉధృతంగా ప్రవహించే ఇసుకవాగు వల్ల పారుమంచాల, తూడిచెర్ల, వాడాల, రేగడగూడూరు తదితర గ్రామాలకు రాకపోకలు స్తంభించిపోయేవి. అత్యవసరమైన వారు చుట్టూ 50 కిలోమీటర్లు తిరిగి గ్రామాలను చేరుకోవాల్సి వచ్చేది. టీటీడీ ఈఓ ధర్మారెడ్డి ఇసుకవాగు వల్ల ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లటంతో సత్వరమే స్పందించారు. ఎండీఆర్ ప్లాన్ కింద ఇసుకవాగుపై వంతెన నిర్మించేందుకుగాను రూ.5కోట్ల నిధులను మంజూరు చేశారు. దీంతో గతేడాది ఆగస్టు 8న వంతెన నిర్మాణానికి ఆర్థిక మంత్రి బుగ్గనరాజేంద్రనాథ్‌రెడ్డి భూమిపూజచేసి పనులు ప్రారంభించారు. పనులు దక్కించుకున్న ఎస్‌వీ కన్‌స్ట్రక్షన్స్ వారు వేగంగా వంతెన నిర్మాణం పనులు చేస్తున్నారు.



వర్షాకాలంలో ఉధృతంగా ప్రవహిస్తున్న ఇసుకవాగు



వంతెన నిర్మాణ పనులు కొనసాగుతున్న దృశ్యం

**60 ఏళ్ల కష్టాలు తీరనున్నాయి**



మా ఊరికి మొదట్లోనే ఇసుకవాగు ఉంది. వాగు దాటితేనే ఊర్లోకి రావాలి. వర్షాకాలంలో ఇసుకవాగు పొంగిపొర్లిందంటే గ్రామంలోకి రాకపోకలు నిలిచిపోతాయి. ఇసుకవాగుపై వంతెన మంజూరు చేయాలని గతంలో అనేకసార్లు పోరాడాం. ఎట్టకేలకు 60ఏళ్ల తర్వాత ఇసుకవాగుపై వంతెన మంజూరైంది. ఇసుకవాగుపై వంతెన నిర్మిస్తే మా ఊరొళ్లతో పాటు మిగిలిన గ్రామాలకు రాకపోకలు సజావుగా సాగుతాయి.

– ఈడుల నారాయణరెడ్డి, పారుమంచాల

**వంతెన పూర్తైతే ఇబ్బందులు తొలగుతాయి**



మా ఊరికి ప్రారంభంలోనే ఉన్న ఇసుకవాగుపై వంతెన పూర్తైతే మాకష్టాలు తీరినట్లే. 60ఏళ్ల నుంచి ఇసుకవాగుపై వంతెన లేక వర్షాకాలంలో పీకల్లోతు పారే నీళ్లల్లోనే ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని దాటేవాళ్లం. ఇప్పుడు వంతెన నిర్మిస్తున్నారు. వంతె నిర్మాణం పూర్తైతే మాఊరొళ్లతో పాటు అందరి కష్టాలు తీరుతాయి.

– మంగలిరాముడు, పారుమంచాల

## జగనన్న పాలనలో ముస్లింలకు పెద్ద పీట



ఎంఐఎం నాయకులకు కండువా కప్పి వైఎస్సార్‌సీపీలోకి ఆహ్వానిస్తున్న సిద్ధార్థరెడ్డి

- రాష్ట్ర శాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు బైరెడ్డి సిద్ధార్థరెడ్డి
- ఎంఐఎం నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిక

**నందికొట్కూరు:** రాష్ట్రంలో ముస్లింలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్ద పీట వేశారని రాష్ట్ర శాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు బైరెడ్డి సిద్ధార్థరెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని 8వ వార్డులో ఎంఐఎం నుంచి ఫారూక్, చాంద్‌బాషా, సయ్యద్‌బాషా, హుసేన్, హఫీజ్, రియాజ్, అల్తాఫ్, సలాం, ముర్తుజావలి, గౌండ అయూబ్, సైపుల్లా, షరీఫ్, మాబాషా, ముర్తుజాతో పాటు 20 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరాయి. వారికి బైరెడ్డి సిద్ధార్థరెడ్డి కండువా కప్పి వైఎస్సార్‌సీపీలోకి సాధారణంగా ఆహ్వానించారు. సిద్ధార్థరెడ్డి మాట్లాడుతూ సామాజిక న్యాయం సీఎం వైఎస్ జగనన్నతోనే సాధ్యమవుతుందన్నారు. గత ప్రభుత్వ హయాంలో జన్మభూమి కమిటీల పేరుతో టీడీపీ కార్యకర్తలకే పథకాలు ఇచ్చారన్నారు. నవరత్నాల పథకాలతో అర్హులైన వారందరికీ ఒక్క పైసా లంచం లేకుండా సంక్షేమ పథకాలు అందించిన ఘనత సీఎం వైఎస్ జగనన్నకే దక్కిందని చెప్పారు. పట్టణంలో ప్రత్యేక నిధులు రూ. 16 కోట్లతో సీసీ రోడ్లు, డ్రైనేజీలు నిర్మించడం జరిగిందన్నారు. 20 ఏళ్ల నుంచి షాదీఖానా నిర్మాణానికి నోచుకోకపోతే జగనన్న పాలనలో రూ.3 కోట్లు వెచ్చించి నిర్మాణం పూర్తి చేశామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి, కౌన్సిలర్లు నాయబ్, కృష్ణ, చాంద్‌బాషా, లాలు, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షులు మన్సూర్, నాయకులు జబ్బార్, అబ్దుల్లా, రాజు, లడ్డూ, రమేష్, బాషా, తదితరులు పాల్గొన్నారు.

## చాకలి ఐలమ్మ విగ్రహావిష్కరణ



ఐలమ్మ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే తొగురు ఆర్థర్, ఐలమ్మ మునిమనుమడు రామచంద్ర, రజకసంక్షేమ సంఘం నాయికులు

**జూపాడుబంగ్లా:** మండల కేంద్రంలో రజకసంక్షేమ సంఘం అధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఐలమ్మ విగ్రహాన్ని ఆదివారం ఎమ్మెల్యే తొగురు ఆర్థర్, ఐలమ్మ మునిమనుమడు రామచంద్ర ఆవిష్కరించారు. రజాకార్లు, పెత్తందార్లపై వీరోచితంగా పోరాడిన చాకలి ఐలమ్మ కుటుంబంలో వారసునిగా పుట్టినందుకు జన్మధన్యమైందని ఆమె మునిమనుమడు చాకలి రామచంద్ర అన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో ఇప్పటిదాకా ఐలమ్మ విగ్రహాలు 265 ఏర్పాటుచేసినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ మొట్టెబాలయ్య, ఎంపీటీసీలు మోతె వెంకటమ్మ, కృపాకర్, రజకసంఘం రాష్ట్ర మాజీ నాయకుడు బస్తిపాటి మౌలాలి, అధ్యక్షుడు రామాంజనేయులు, కార్యదర్శి నాగభూషణం, ఉపాధ్యక్షుడు రవి, వైఎస్సార్సీపీ నాయకులు జంగాలపెద్దన్న, కృష్ణారెడ్డి, దేవసహాయం, శివానందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పట్టణాభివృద్ధికి ప్రత్యేక నిధులు

**నందికొట్కూరు:** పట్టణాభివృద్ధికి ప్రత్యేక నిధులు ప్రభుత్వం మంజూరు చేసిందని మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని 21వ వార్డులో కౌన్సిలర్ ఎం. లక్ష్మీదేవి ఆధ్వర్యంలో సీసీ రోడ్ల నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు. ఆయన మాట్లాడుతూ పట్టణంలో అభివృద్ధి పనులకు ప్రభుత్వం రూ, 16 కోట్లు నిధులు మంజూరు చేసిందన్నారు. పట్టణంలో ఎన్నడూ లేని విధంగా సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణ పనులు చేయడం జరిగిందని చెప్పారు. గత టీడీపీ పాలనలో అభివృద్ధి శూన్యమన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కుర్వ శ్రీను, మద్దిలేటి, సురేష్, శేషు, రాజు, వేణు, వెంకటేష్, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.



సీసీ రోడ్ల నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి

## ఆర్యవైశ్య సంఘం మండల కమిటీ ఎన్నిక



ఆర్యవైశ్య సంఘం నూతన మండల కమిటీ సభ్యులు

**వెలుగోడు:** స్థానిక వాసవీ కల్యాణ మండపంలో ఆదివారం వైఎస్సార్‌సీపీ ఉమ్మడి జిల్లాల వాణిజ్య విభాగం అధ్యక్షుడు బళ్లాని వెంకట సత్యనారాయణ అధ్యక్షతన ఆర్యవైశ్య సంఘం మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షుడిగా బచ్చు రాము(గుంతకందాల), ఉపాధ్యక్షులుగా సోమ చంద్ర శేఖర్ (వేల్పనూరు), సూరా సత్యనారాయణ (రేగడగూడురు), బొగ్గరపు లక్ష్మీనారాయణ, లాలం మల్లికార్జున, కార్యదర్శిగా సంబురామయ్య (వెలుగోడు), సహాయ కార్యదర్శులుగా లాలం. శ్రీనివాసులు, అబ్దుల్లాపురం రమణ, సాంబయ్య, (బోయరేవుల), సభ్యులుగా సోమా సతీశ్, పలుకూరు శ్రీనివాసులు, దొంతు బాలనరసింహ్మయ్య, సీహెచ్ లక్ష్మీనారాయణ, వరద రవిబాబు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం సీనియర్ నాయకులు లాలం సుధాకర్, మాజీ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు లాలం రామకృష్ణయ్య, జూటూరు నాగపుల్లయ్య, మారెపాటి రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

### ప్రజల చూపు వైఎస్సార్‌సీపీ వైపు

**పాములపాడు:** రాష్ట్రంలో ప్రజలందరి చూపు వైఎస్సార్‌సీపీ వైపేనని పార్టీ మండలాధ్యక్షుడు రామలింగేశ్వరరెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో వైఎస్సార్‌సీపీ గ్రామ స్థాయి నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి నేటి వరకు ప్రజలకు ప్రతి రోజు సంక్షేమ పథకాల పండుగేనన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు చేసిన మేలును ప్రజలే గ్రహిస్తున్నారన్నారు. ప్రతి కార్యకర్త, నాయకులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. అందరినీ కలుపుకుపోవడమే మనందరిని నినాదమని అన్నారు. సమావేశంలో తుమ్మలూరు సర్పంచు వరప్రసాద్, మాజీ సర్పంచు బాలునాయక్, నాయకులు మహానందిరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, శ్రీనివాసులు గౌడు, రామకోటినాయక్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు రామలింగేశ్వరరెడ్డి

# పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- ఎథిక్స్ కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే శిల్పాచక్రపాణిరెడ్డి
- కృష్ణాపురంలో ఇళ్ల పట్టాల పంపిణీ

**ఆత్మకూరు:** పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని అసెంబ్లీ ఎథిక్స్ కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి అన్నారు. పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆదివారం కృష్ణాపురం గ్రామానికి చెందిన లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నిరుపేదల సంక్షేమానికి పెద్ద పీట వేసిందని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నవరత్నాల ద్వారా ఎన్నో పథకాలు అందజేస్తూ ప్రజల హృదయాలను చూరగొన్నారన్నారు. ప్రతి లబ్ధిదారుడికి ప్రభుత్వం విరివిరిగా సంక్షేమ పథకాలు అందించిందన్నారు. ప్రధానంగా ఆరోగ్యశ్రీ, 108 పథకాలతో పాటు అమ్మ ఒడి నిరుపేద తల్లిదండ్రులకు ఎంతో ఊరటనిచ్చే పథకమని చెప్పారు. నిజమైన లబ్ధిదారులకు అర్హత ఉంటే చాలు ప్రభుత్వ పథకాలను అందజేస్తున్నామన్నారు. కృష్ణాపురం గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో ఇంటింటా ప్రచారం నిర్వహిస్తున్న సమయంలో పలువురు లబ్ధిదారులు తమకు పక్కా గృహాలు లేవని, ప్రధానంగా ఇళ్ల స్థలాలు కూడా లేవని తమ దృష్టికి తీసుకొని రావడం జరిగిందన్నారు. ఇందుకు గాను అక్కడికక్కడే రెవెన్యూ, సచివాలయ ఉద్యోగులతో చర్చించి గ్రామాల్లో నిజమైన లబ్ధిదారులను గుర్తించి ఇళ్ల స్థలాలు, పక్కా గృహాలు మంజూరు చేయాలని ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. ఫలితంగా ఒక్క గ్రామంలోనే 32మంది నిజమైన లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలు ఇవ్వడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. వీరికి త్వరలోనే పక్కా గృహాలు కూడా మంజూరు చేస్తామన్నారు. అనంతరం లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు.



లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలను అందజేస్తున్న ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి

**సివిల్ విద్యార్థికి ఆర్థిక సాయం ..**

మండలంలోని పెద్ద అనంతపురం గ్రామానికి చెందిన మహేష్‌నాయక్ అనే విద్యార్థి సివిల్ పరీక్షకు ప్రిపేర్ అవుతుండడంతో ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి ఆర్థిక సాయం అందజేశారు. నిరుపేద కుటుంబానికి చెందిన విద్యార్థి హైదరాబాద్‌లోని కోచింగ్ సెంటర్ నందు సివిల్‌కు ప్రిపేర్ అవుతుండటంతో కోచింగ్ నిర్వహిస్తున్న సంస్థ నిర్వాహకులతో మాట్లాడి 40శాతం ఫీజులో రాయితీని ఇప్పించడమే కాకుండా రూ.10వేలు ఆర్థిక సాయం కూడా అందించారు. అంతకు మునుపు క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న కిషన్‌సింగ్ వీధికి చెందిన రఫీక్ వివరాలు తెలుసున్న ఎమ్మెల్యే చక్రపాణిరెడ్డి రూ.5వేలు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఉమాదేవి, పార్టీ అధ్యక్షుడు సయ్యద్‌మీర్, రాజమోహన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు లక్ష్మిరెడ్డి, పుల్లారెడ్డి, రామకృష్ణారెడ్డి, విజయచౌదరి, భాస్కర్, జెడ్పీటీసీ శంకర్‌రెడ్డి, మునీర్‌బాషా, తదితరులు పాల్గొన్నారు.

### అక్రమ మద్యం తరలిస్తే కఠిన చర్యలు



పట్టుబడిన మద్యం బాటిళ్లను చూపుతున్న ఎస్ఐ నాగార్జున

**నందికొట్కూరు రూరల్ :** తెలంగాణ రాష్ట్రం నుంచి అక్రమ మద్యం తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని బ్రాహ్మణకొట్కూరు ఎస్ఐ నాగార్జున హెచ్చరించారు. ఆదివారం నందికొట్కూరు మండల పరిధిలోని వడ్డెమాను గ్రామం వద్ద వాహనాల తనిఖీ నిర్వహించగా తెలంగాణ రాష్ట్రం నుంచి అక్రమంగా మద్యం తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసి 20 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అలాగే ద్విచక్ర వాహనాన్ని సీజ్ చేసి ముర్తుజావలి అనే వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.

**సారాబట్టీలు ధ్వంసం**

**ఆత్మకూరు:** మండలంలోని సిద్దాపురం గ్రామ సమీపంలో ఆదివారం ఎస్ఐ కృష్ణమూర్తి ఆధ్వర్యంలో నాటుసారా బట్టీలను ధ్వంసం చేశారు. ఎస్ఐ మాట్లాడుతూ డీఎస్పీ శ్రీనివాసరావుయాదవ్, సీఐ నాగభూషణంయాదవ్ ఆధ్వర్యంలో సారాబట్టీలపై దాడులు నిర్వహించామన్నారు. ఈ దాడుల్లో 800లీటర్ల బెల్లంఊట, 14లీటర్ల నాటుసారాను పారబోసినట్లు తెలిపారు.

**నాటుసారా విక్రేత అరెస్ట్**

**పగిడ్యాల:** మండల కేంద్రానికి చెందిన వడ్డె సాయికృష్ణ ఆదివారం గ్రామంలోని గండి వద్ద సారా విక్రయిస్తుండగా సిబ్బందితో వెళ్లి అరెస్టు చేసినట్లు ఎస్ఐ జయశేఖర్ తెలిపారు. అతని వద్ద నుంచి 6 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకుని అతనిపై ప్రొహిబిషన్ యాక్ట్ కింద కేసు నమోదు చేసి అరెస్ట్ చేశామని వెల్లడించారు.

**మద్యం బాటిళ్లు స్వాధీనం**

**మిడుతూరు:** మండలపరిధిలోని చెరుకుచెర్ల గ్రామానికి చెందిన ఓ వ్యక్తి నుంచి 58 బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ జగన్ మోహన్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల మేరకు చెరుకుచెర్ల గ్రామానికి చెందిన పేరెడ్డి ప్రతాపరెడ్డి మిడుతూరు వైన్‌షాపు నుంచి 58 క్వార్టర్ బాటిళ్లను తన ద్విచక్ర వాహనంపై తీసుకెళ్తుండగా .. సమాచారం మేరకు మిడుతూరు గ్రామ శివారులో అతనిని అదుపులోకి తీసుకున్నామన్నారు. అతని వద్ద నుంచి 58 బాటిళ్లను స్వాధీనం చేసుకోవడంతో పాటు ద్వి చక్రవాహనం సీజ్ చేసి కేసు నమోదు చేశామని చెప్పారు.

### మత్స్యకారులను ఆదుకోవాలి

**నంద్యాల(అర్బన్):** సున్నిపెంట లింగాల గట్టు మత్స్యకారులను ప్రభుత్వం ఆదుకోవాలని ఎంవీఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పులికొండన్న కోరారు. స్థానిక కార్యాలయంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ శ్రీశైలం నియోజకవర్గం లింగాలగట్టు వద్దనున్న దిగువ శ్రీశైలం ప్రాజెక్టులో విషవాయువు కలిసి టన్నుల కొద్ది చేపలు మృత్యువాత పడ్డాయన్నారు. చేపల వేటతో ఉపాధి పొందుతున్న వంద వాల్మీకి (మత్స్యకారులు) కుటుంబాలు తీవ్రంగా నష్టపోయారన్నారు. ప్రభుత్వం వారికి ఉపాధి చూపించి ఆదుకోవాలని కోరారు.

### అమ్మవారిపై ఎందుకంత నిర్లక్ష్యం?

**కొత్తపల్లి:** పవిత్ర పుణ్యక్షేత్రం, రాష్ట్రంలో ఏకైక సరస్వతి క్షేత్రంగా వీరాజిల్లుతున్న శ్రీ కొలనుభారతి దేవిపై పురోహితులు, ఆలయ సిబ్బంది ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారని కాకనూరు శ్రీశారదాపీఠం పీఠాధిపతి శ్రీ శివయోగేంద్ర సరస్వతి స్వామి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం ఆయన కొలనుభారతి క్షేత్రాన్ని సందర్శించారు. ఉదయం 8.30 గంటలైన ఆలయం వద్ద పురోహితులుగానీ, సిబ్బంది గానీ లేకపోవడంతో అసహనం వ్యక్తం చేశారు. ప్రాతఃకాలాన అమ్మవారికి జరగాల్సిన అభిషేకం, పూజలు జరగక పోవడంపై ఆవేదన వ్యక్తపరిచారు. ఆయనతో పాటుగా నరసారావుపేట, ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు కూడా పురోహితుల కోసం వేచిచూడాల్సి వచ్చింది. ఆయన రాకను గమనించిన సిబ్బంది పురోహితులకు సమాచారం ఇస్తే ఆలయం వెనుకనుంచి వచ్చి అమ్మవారి ఆలయాన్ని శుభ్రపరిచి, ఆతర్వాత అభిషేకం నిర్వహించారు. శివయోగేంద్ర సర్వసతి స్వామి మాట్లాడుతూ ఎంతో మహిమ ఉన్న అమ్మవారిని పురోహితులు, సిబ్బంది వారి స్వార్థంకోసం పట్టిపట్టనట్టుగా వ్యవరించడం బాధాకరమన్నారు. ముగ్గురు పురోహితులు ఉంటే ఏ ఒక్కరు కూడా అమ్మవారికి ఉదయ కాలంలో అభిషేకం, మంగళహారతి ఇవ్వకపోడం ఏమిటని ప్రశ్నించారు. ఇక్కడ రెగ్యూలర్ ఈఓను నియమించాలని, పురోహితులు, సిబ్బందిపై చర్యలు తీసుకునేందుకు కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తానని చెప్పారు.



అమ్మవారికి మంగళహారతి ఇస్తున్న పీఠాధిపతి

## నియోజకవర్గ ప్రజలందరూ మా కుటుంబ సభ్యులే



వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి

- ఎథిక్స్ కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి
- టీడీపీని వీడి 100 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరిక

**ఆత్మకూరు:** శ్రీశైలం నియోజకవర్గ ప్రజలందరూ మా కుటుంబ సభ్యులేనని స్థానిక ఎథిక్స్ కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి అన్నారు. పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆదివారం జోహా వైద్యశాలకు చెందిన 100 మంది టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి ఎమ్మెల్యే కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలు సేవ చేసేందుకే రాజకీయాల్లోకి వచ్చానని, పేద ప్రజల కోసం ప్రతి ఏడాది రూ.3కోట్లకు పైగా ఖర్చు చేస్తున్నామని, నియోజకవర్గ అభివృద్దే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామన్నారు. రైతులు, పొదుపు మహిళలు వివిధ వర్గాల ప్రజలకు తాము అందుబాటులో ఉండి ప్రజలకు అత్యవసర వేళ ఏ కార్యక్రమం చేయాలన్నా ముందుండి అందరికీ సహాయ సహకారాలు అందిస్తున్నానని చెప్పారు.

**ఎన్ని కుయుక్తులు పన్నినా వైఎస్సార్‌సీపీదే విజయం**

మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డికి నియోజకవర్గంలో నో టికెట్ అని, ఎన్నో కుయుక్తులు పన్ని టికెట్ దక్కించుకోవాలని ప్రయత్నిస్తున్నారని చెప్పారు. తమ కుటుంబ సభ్యులు మాకు సంస్కారాన్ని నేర్పారని, అడ్డగోలుగా మాట్లాడే మనస్తత్వం తమది కాదని చెప్పారు. ఎవరు ఎన్ని కుయుక్తులు పన్ననా.. శ్రీశైలం నియోజకవర్గంలో వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి తిరుగులేని విజయం తథ్యమని చెప్పారు. మాజీ ఎమ్మెల్యే టీడీపీ కార్యకర్తలను గాలికి వదిలేశారని, ఒక కుటుంబం పార్టీలో చేరితే 10 కుటుంబాలు, 20 కుటుంబాలు చేరితే 200 కుటుంబాలు చేరాయని పబ్లిసిటీ చేసుకోవడం ఆయనకే చెల్లిందన్నారు. వెలుగోడులో ఇటీవల 22మంది మోడల్ స్కూల్ విద్యార్థులకు టీడీపీ కండువాలు వేసి పార్టీలో చేరినట్లు చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. ఆత్మకూరు పట్టణంలో రూ.30కోట్లతో అభివృద్ధి చేసినట్లు చెప్పారు.

**అభివృద్ధికి ఆకర్షితులై పార్టీలోకి..**

నియోజకవర్గంలో ఎమ్మెల్యే శిల్పాచక్రపాణిరెడ్డి చేస్తున్న అభివృద్ధి పనులు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముస్లిం మైనార్టీలకు అమలు చేసిన సంక్షేమ పథకాలకు ఆకర్షితులై టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరినట్లు పార్టీలో చేరిన షేక్ ముర్తుజావలి, మగ్బుల్‌బాషా, ఫిరోజ్, ఆర్మీ రఫీ తెలిపారు. అంతకు మునుపు జోహా వైద్యశాల డైరెక్టర్ మగ్బుల్ బాషా ఆధ్వర్యంలో వారి బంధువర్గం రషీద్, షాలుపైల్వాన్, ఇంతియాజ్, హుసేన్‌వలి, సాయిచరణ్, గుంతకందాల చాంద్‌బాషా, అస్లాం, కురుకుంద మాబాషా, మౌలాలి, గౌస్, మహబూబ్ మీయా, చిరంజీవి, సలాం కుటుంబ సభ్యులు వైఎస్సార్‌సీపీలో చేరారు. మాజీ మున్సిపల్ చైర్మన్ నూర్‌మహమ్మద్, వైఎస్సార్‌సీపీ నాయకులు వరాల మాలిక్, పట్టణ అధ్యక్షుడు సయ్యద్‌మీర్, నాయకులు సురేష్, లక్ష్మిరెడ్డి, రమణ, వెంకటస్వామిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.